క్లుప్తంగా

అంకితభావంతో పని చేస్తేనే గుర్తింపు



సాయిబాబు దంపతులను సన్మానిస్తున్న నాయకులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): అంకితభావంతో పనిచేసే ఉద్యోగికి తగిన గుర్తింపు లభిస్తుందని ఏపీఎస్ఈబీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు జీవీ కిరణ్, శివకుమార్ అన్నారు. ఈపీడీసీఎల్ ఏలూరు సర్కిల్ పరిధిలో 39 ఏళ్లపాటు వివిధ హోదాల్లో సేవలందించడంతో పాటు ఏపీఎస్ ఈబీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ కంపెనీ ప్రధాన కార్యదర్శిగా ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేసిన చొప్పల సాయిబాబు పదవీ విరమణ సన్మాన సభ స్థానిక గిరిజన భవన్‌లో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సాయిబాబు దంపతులను ఘనంగా సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. కిరణ్, శివకుమార్, ఈపీడీసీఎల్ ఏలూరు సర్కిల్ ఎస్ఈ పి.సాల్మన్ రాజు మాట్లాడుతూ సాయిబాబు సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఈపీడీసీఎల్ ఏలూరు డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జేపీబీ నటరాజన్, జీఏవీ పాల్, ఎన్. వెంకట్రావు, సీహెచ్ జాన్ మోషే, విద్యుత్ జేఏసీ నాయకులు తురగా రామకృష్ణ, భూక్యా నాగేశ్వర రావు నాయక్, సుందరరావు, రాజ్‌కుమార్, వై. శ్రీనివాసరావు, ఇజ్రాయేలు, జయరాజు తదితరులు పాల్గొన్నారు.

వరకట్న వేధింపులపై కేసు నమోదు

ఏలూరు టౌన్: వివాహ సమయంలో ఇచ్చిన కట్నం చాలలేదంటూ అదనపు కట్నం తీసుకురావాలని భర్త, అత్తింటి వారు వేధింపులకు గురి చేయడంతో బాధితురాలు ఏలూరు త్రి టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఆమె భర్తపై కేసు నమోదు చేశారు. ఏలూరు సమీపంలోని సత్రంపాడు హౌసింగ్ బోర్డు కాలనీలో నివాసం ఉంటున్న ఎంఎం మనోజ (30)కు 11 ఏళ్ల క్రితం ఏలూరు ఆర్డీఓ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న శ్రీనివాసరావుతో వివాహమైంది. వివాహ సమయంలో ఇచ్చిన కట్నంచాలలేదని అదనంగా మరో రూ.5 లక్షలు కట్నంగా తీసుకురావాలని భర్త వేధిస్తున్నాడు. అత్త, ఆడపడుచు, ఆడపచు భర్త, వారి మేనమామ కలిసి శ్రీనివాసరావును ప్రోత్సహించి మనోజను వేధిస్తున్నారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు శ్రీనివాసరావుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్విమ్మింగ్‌లో రాణిస్తున్న చిన్నారులు

- పలు పోటీల్లో విజయం
- బిశ్వనాథ్ భర్తియా స్విమ్మింగ్ పూల్‌లో శిక్షణ

ఏలూరు రూరల్: రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో ఏలూరులో బిశ్వనాథ్ భర్తియా స్విమ్మింగ్ పూల్‌లో నిర్వహిస్తున్న స్విమ్మింగ్ శిక్షణలో పిల్లలు రాటుదేలుతున్నారు. ఇక్కడ ప్రతిరోజు ఉదయం, సాయంత్రం పదుల సంఖ్యలో బాలబాలికలు సాధన చేస్తున్నారు. పలువురు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని పతకాలు సాధించారు. పాఠశాల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో పోటీల్లో పాల్గొని ఏలూరు పట్టణానికి పేరు తెస్తున్నారు. కొద్ది నెలల క్రితం విజయవాడలో జరిగిన ఐదో రాష్ట్రస్థాయి సీనియర్ స్విమ్మింగ్ పోటీల్లో పాల్గొన్న ఏలూరుకు చెందిన కేవీఆర్ కిషోర్ 100 మీటర్ల ఫ్రీ స్టైయిల్‌లో బ్రాంజ్ మెడల్ సాధించాడు. కె.జోహర్ 200 మీటర్ల బ్రెస్ట్‌స్ట్రోక్, 200 మీటర్ల బట్టర్‌ఫ్లై విభాగంలో రెండు సిల్వర్ మెడల్స్ సొంతం చేసుకున్నాడు. బాలికల విభాగంలో పి.అక్షిత 100, 200 మీటర్ల బట్టర్‌ఫ్లై విభాగంలో రెండు బ్రాంజ్ మెడల్స్ సాధించింది. వీరి స్ఫూర్తితో నగరంలో బాలబాలికలు స్విమ్మింగ్‌పై మక్కువ పెంచుకుని సాధన చేస్తున్నారు.

శిక్షణ సమయం

పిల్లల్లో స్విమ్మింగ్ పట్ల ఆసక్తి పెంచి ఉత్తమ క్రీడాకారులుగా తీర్చిదిద్దేందుకు అధికారులు ఆరేళ్ల వయస్సు నుంచి 18 ఏళ్ల వయస్సు బాలబాలికలకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. రోజుకు గంట చొప్పున ప్రతిరోజూ ఉదయం 6 నుంచి 9 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకూ పిల్లలు, పెద్దలకు సమయం కేటాయించారు. సాయంత్రం 6 నుంచి 7 గంటల వరకూ మహిళలకు మాత్రమే అవకాశం కల్పిస్తున్నారు. వేసవిలో స్విమ్మింగ్ సాధన చేసేవారి తాకిడి ఎక్కువగా ఉండడంతో ఏప్రిల్, మే నెలల్లో మాత్రమే నిర్ణీత ఫీజులు వసూలు చేస్తున్నారు.



ఏలూరులో జరిగిన పోటీల్లో పాల్గొన్న బాలబాలికలు (ఫైల్)



ఏలూరు బిశ్వనాథ్ భర్తియా స్విమ్మింగ్ పూల్‌లో సాధన చేస్తున్న చిన్నారులు

పతకాలు సాధిస్తా



మా మమ్మీ, డాడీ నన్ను ఎంకరేజ్ చేస్తున్నారు. నాకు స్విమ్మింగ్ పోటీల్లో పాల్గొనాలని ఉంది. పతకాలు సాధించాలని ఉంది. మా కోచ్ గణేష్ వద్ద శిక్షణ తీసుకుంటున్నాను. మా సీనియర్స్‌తో కలిసి ప్రాక్టీస్ చేస్తున్నాను. తరువాత సంవత్సరం నేను కూడా సీనియర్స్‌తో పాటు పోటీల్లో పాల్గొంటాను. తప్పకుండా మెడల్ సాధిస్తాను. అందుకోసం ఇప్పటి నుంచే ప్రాక్టీసు చేస్తున్నాను.

– జె.యశస్విని

స్విమ్మింగ్ అంటే ఇష్టం



మొదట నాకు స్విమ్మింగ్ అంటే చాలా భయం వేసింది. మా మమ్మీ, డాడీ ధైర్యం చెప్పి స్విమ్మింగ్ నేర్పించారు. ఇప్పుడు స్విమ్మింగ్ అంటే చాలా ఇష్టం. లాస్ట్ ఇయర్ నేను విజయవాడలో జరిగిన జూనియర్ ఖేలో ఇండియా పోటీల్లో పాల్గొన్నాను. దీంతో నాకు లక్ష్యం ఏర్పడింది. జాతీయ స్థాయి స్విమ్మర్స్ వలె నేను కూడా రాణించాలని ఉంది. అందుకే ప్రత్యేక శిక్షణ తీసుకుంటున్నాను.

– సీహెచ్ పూర్వి

మనల్ని మనం కాపాడుకోగలం



ఈత నేర్చుకోవడం వల్ల ఎన్నో ఉపయోగాలు ఉన్నాయి. మనల్ని మనం కాపాడుకోగలం, ఇతరులను కాపాడగలం. మొదట ఈత కొలనులో దిగితే ప్రాణం పోతుందేమో అని అనిపించింది. ఇప్పుడు ధైర్యంగా పూల్‌లో దూకేస్తాను. నేను కూడా పోటీల్లో పాల్గొంటున్నాను. విజయవాడలో జరిగిన పోటీల్లో పాల్గొన్న తర్వాత పతకాలు సాధించాలనే కసి నాలో పెరిగింది. అందుకే సాధన చేస్తున్నాను.

– యు.మోహనదీప్తి

నీరంటే భయం పోయింది



నాకు నీరంటే భయం పోయింది. మొదట ఒక మీటర్ మాత్రమే స్విమ్మింగ్ చేసేదాన్ని. ఇప్పుడు పూల్ మొత్తం స్విమ్మింగ్ చేయగలను. ఇటు నుంచి అటు, అటు నుంచి ఇటు స్విమ్ చేస్తాను. ఇప్పుడు నాకు స్విమింగ్ ఈజీగా ఉంటుంది. మొదట అందరూ ఈత అంటేనే భయపడిపోతున్నారు. కాని నేను ఈత నేర్చుకున్న తర్వాత నాలో ధైర్యం వచ్చింది. అందరూ ఈత నేర్చుకోవాలి.

– ఎండి సిద్రీ

జాతీయ స్థాయిలో పతకం సాధిస్తా



నేను 8వ తరగతి చదువుతున్నాను. జాతీయ స్థాయి స్విమ్మింగ్ పోటీల్లో బంగారు పతకం సాధించడం నా కల. అందుకే ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం సాధన చేస్తున్నాను. శిక్షణ తీసుకుంటున్నాను. ఢిల్లీలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో పతకం సాధించాను. విజయవాడలో జరిగిన జూనియర్ ఖేలో ఇండియా పోటీల్లో పాల్గొన్న తర్వాత నాకు ధైర్యం వచ్చింది.

– ఎస్‌కే హకీమ్

రాష్ట్ర పోటీల్లో పతకం సాధించా



నేను ఆరో తరగతి చదువుతున్నాను. రెండేళ్లుగా స్విమ్మింగ్ ప్రాక్టీస్ చేస్తున్నాను. రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ పోటీల్లో ఫస్ట్ మెడల్ సాధించాను. భువనేశ్వర్‌లో జరిగిన జాతీయ స్థాయి జూనియర్ స్విమ్మింగ్ పోటీల్లో సైతం పాల్గొన్నాను. నాకు నేషనల్ గోల్డ్‌మెడల్ సాధించాలని ఉంది. ఇదే నా కల. అందుకే ప్రతి రోజూ ప్రాక్టీస్ చేస్తున్నాను.

– బి.స్వామినాయుడు

తల్లిదండ్రుల ప్రోత్సాహం



ఇటీవల తల్లిదండ్రులు స్విమ్మింగ్ చేయాలని పిల్లలను ప్రోత్సహిస్తున్నారు. ఇది మంచి ఆలోచన. స్విమ్మింగ్ పిల్లలను మానసికంగా, శారీరకంగా ఉత్సాహవంతులను చేస్తుంది. ప్రపంచ స్థాయి స్విమ్మింగ్ పోటీల్లో కాంపిటేషన్ పెరిగింది. పిల్లలు ఎక్కువగా సాధనపై దృష్టి పెడుతున్నారు. కొన్నేళ్లుగా శిక్షణ ఇస్తున్నాను. రాబోయే రోజుల్లో స్విమ్మర్లు తయారౌతారనే నమ్మకం కలుగుతోంది.

– గణేష్, కోచ్

రైలు ప్రమాద మృతుడి గుర్తింపు

ఏలూరు టౌన్: ఏలూరు పవర్‌పేట రైల్వేస్టేషన్ సమీపంలో రైలుకింద పడి మృతి చెందిన వ్యక్తి ఏలూరు గాంధీనగర్‌కు చెందిన చలమల్ల రమేష్‌గా గుర్తించామని రైల్వే ఎస్సై డి.నరసింహారావు తెలిపారు. రమేష్ అతిగా మద్యం సేవిస్తూ కుటుంబాన్ని నిర్లక్ష్యం చేస్తూ జీవిస్తున్నాడనీ, మద్యానికి డబ్బులు ఇవ్వలేదనే కారణంతో మనస్థాపానికి గురై గురువారం సాయంత్రం విజయవాడ వైపు వెళ్లే రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ రైలుకిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడని చెప్పారు. గతంలోనూ ఇదే తరహాలో కుటుంబ సభ్యులను పదిసార్లు ఆత్మహత్య చేసుకుంటానంటూ బెదిరించాడని, మద్యానికి బానిసగా మారిన నేపథ్యంలో ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అందజేశామని రైల్వే ఎస్సై చెప్పారు.

ఘనంగా యోగా దినోత్సవం



ఏలూరు (ఆర్ఆర్‌పేట) : సీఆర్ఆర్ కళాశాలలో విద్యార్థుల యోగాసనం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): భారత దేశానికి చెందిన యోగ ప్రక్రియ ప్రపంచంలోని అన్ని దేశాలకు వ్యాపించడం దేశ గౌరవాన్ని ఇనుమడింప చేస్తోందని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్ అబ్రహం అన్నారు. స్థానిక కస్తూరిబా నగరపాలక బాలికోన్నత పాఠశాలలో, తూర్పువీధి నగరపాలక ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన అంతర్జాతీయ యోగ దినోత్సవ కార్యక్రమాల్లో డీఈఓ అబ్రహం, సమగ్ర శిక్ష అదనపు పథక సమన్వయ కర్త బి.సోమశేఖర్ పాల్గొని మాట్లాడారు. జిల్లాలోని అన్ని యాజమాన్యాల్లోని ఉన్నత పాఠశాలల్లో యోగ దినోత్సవం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులందరితోనూ యోగ నినాదాలు చెప్పించారు. ఫిజికల్ డైరెక్టర్ హరిబాబు, ప్రసన్న, మురళి ఆధ్వర్యంలో విద్యార్థులతో యోగాసనాలు వేయించారు. కార్యక్రమంలో అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ రెడ్డి రామారావు, ఏఎల్ఎస్ కోఆర్డినేటర్ జి.రాధాకృష్ణ, సహిత విద్య కోఆర్డినేటర్ బి.భాస్కర్ రాజు, ఎంఈఓ ఆర్ రంగయ్య పాల్గొన్నారు.

బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో..

యోగ సాధన ప్రతి ఒక్కరి జీవితాల్లో దినచర్య కావాలని రాజయోగిని బీకే లావణ్య పిలుపునిచ్చారు. నగరంలోని బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో అశోక్ నగర్ వంతెన వద్ద శుభోదయం పార్కులో యోగ డే కార్యక్రమం నిర్వహించారు. లావణ్య మాట్లాడుతూ యోగ సర్వాంగీన వికాసానికి తోడ్పడుతుందని, శరీరానికి ఆరోగ్యాన్ని, మనసుకు ప్రశాంతతను, సంబంధాలలో సద్భావనను, సమాజంలో శ్రేయస్సును అందిస్తుందని చెప్పారు. పతంజలి యోగమిత్ర మండలి గురువు సాంబశివరావు యోగ డే విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో డాక్టర్లు కూరపాటి శ్రీనివాసరావు, నిర్మల, పలువురు వాకర్లు, గృహిణులు పాల్గొన్నారు.

సీఆర్ఆర్ పబ్లిక్ స్కూల్‌లో..

ఎన్‌సీసీ 19వ ఆంధ్ర బెటాలియన్ కల్నల్ ముఖర్జీ ఆదేశాల మేరకు స్థానిక సీఆర్ రెడ్డి పబ్లిక్ స్కూల్ ప్రధానోపాధ్యాయులు పి.సాయికుమారి శంకర్ ఆధ్వర్యంలో వివిధ పాఠశాలలకు చెందిన ఎన్‌సీసీ విద్యార్థులచే అంతర్జాతీయ యోగ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. యోగాపై అవగాహన కోసం ర్యాలీ నిర్వహించారు. యోగాసనాలు ప్రదర్శించారు. ఈ సందర్భంగా సీఆర్‌రెడ్డి పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ వంకినేని రఘు కుమార్ ఎన్‌సీసీ విద్యార్థులను, ఆఫీసర్లను, గురువులను అభినందించారు.

శారీరక, మానసిక ఎదుగుదలకు దోహదం

విద్యార్థుల శారీరక, మానసిక ఎదుగుదలకు యోగ దోహదపడుతుందని సీఆర్ఆర్ అటానమస్ కళాశాల కరస్పాండెంట్ కేఎస్ విష్ణుమోహన్ తెలిపారు. సీఆర్ఆర్ అటానమస్ కళాశాలలో ప్రిన్సిపాల్ కేఏ రామరాజు అధ్యక్షతన నిర్వహించిన యోగ దినోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. వ్యాయామ అధ్యాపకులు ఎ.ధర్మేంద్ర, ఎం సాయి కిషోర్, వైస్ ప్రిన్సిపాల్ కె.విశ్వేశ్వరరావు, పీజీ డైరెక్టర్ వీఆర్ సతీష్ బాబు, ఇంటర్మీడియట్ ప్రిన్సిపాల్ ఎస్ శ్రీనివాసరావు, ఐక్యూసీ కోఆర్డినేటర్ కె.రాము, కళాశాల గ్రంథపాలకులు వి.గీత, ఎం జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

నిరాశ, నిస్పృహలకు చక్కటి ఔషధం

నిత్యం యోగాభ్యాసం చేయడం వల్ల మనిషి ఒత్తిడి తగ్గి ఆరోగ్యంగా ఉండడంతో పాటు నిరాశ, నిస్పృహలకు చక్కటి ఔషధంగా పని చేస్తుందని సెయింట్ థెరిస్సా మహిళా కళాశాల ప్రిన్సిపాల్ సిస్టర్ మెర్సీ అన్నారు. అంతర్జాతీయ యోగ దినోత్సవంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఎన్‌సీసీ అధికారి సెలీన్ రోజ్, తెలుగు, హిందీ విభాగాల అధిపతి మహాలక్ష్మి, వైస్ ప్రిన్సిపాల్ సిస్టర్ మరియా క్రిస్టియా తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల యోగాసనాలు

ఏలూరు రూరల్ : మాదేపల్లి జెడ్పీ పాఠశాలలో నిర్వహించిన యోగ దినోత్సవం ఎంఈఓ–2 రంగయ్య ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతి విద్యార్థి దైనందిన జీవితంలో యోగా భాగం చేసుకోవాలని సూచించారు. హెచ్ఎం వెంకటలక్ష్మి, ఉపాధ్యాయులు పువ్వుల ఆంజనేయులు తదితరులు యోగ ప్రాముఖ్యత వివరించారు. అనంతరం బాలబాలికలు పిరిమిడ్ ఆకారంలో యోగాసనాలు వేసి అందరినీ అబ్బుర పరిచారు.



ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన యోగ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా అధికారులు



ఏలూరు (ఆర్ఆర్‌పేట) : శుభోదయం పార్కులో యోగ గురువుకు సన్మానం



ఏలూరు రూరల్ : ఆశ్రంలో యోగాసనాలు సాధన గూరించి వివరిస్తున్న ఇన్‌స్ట్రక్టర్



ఏలూరు (ఆర్ఆర్‌పేట) : కార్యక్రమంలో మాట్లాడుతున్న బి.సోమశేఖర్

ఆశ్రం వైద్య కళాశాలలో..

నిర్వహించిన యోగ కార్యక్రమంలో ఆశ్రం డైరక్టర్లు జి.రతీదేవి, కె.అంజిరెడ్డి, సీఈఓ కె.హనుమంతు రావు, వైస్ ప్రిన్సిపాల్ ఎస్ వేణుగోపాలరాజు, యూరాలజిస్ట్ రమేష్, రాజనాజన్ పాల్గొన్నారు. యోగ ఇన్‌స్ట్రక్టర్ మల్లికార్జున పర్యవేక్షణలో సుమారు 300 మంది వైద్య విద్యార్థులు యోగాసనాల సాధన చేశారు. యోగ ప్రాముఖ్యతను తెలుసుకున్నారు.

- తంగెళ్లమూడి శ్రీసూర్య స్కూల్‌లో డైరక్టర్ కొండపల్లి చంద్రశేఖర్ నేతృత్వంలో యోగ దినోత్సవం నిర్వహించారు. ప్రిన్సిపాల్ దానియేలు, హెచ్ఎం దుర్గారావు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఏలూరు (ఆర్ఆర్‌పేట) : సీఆర్ఆర్ పబ్లిక్ స్కూల్‌లో ఎన్‌సీసీ విద్యార్థుల ర్యాలీ



ఏలూరు రూరల్ : మాదేపల్లి జడ్పీ పాఠశాలలో పిరిమిడ్ యోగాసనం

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	29
ఏలూరు –బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	39
ఏలూరు – బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.30	43
ఏలూరు – తిరుపతి(ఇంద్ర)	16.00	--
ఏలూరు – తిరుపతి(ఇంద్ర)	19.00	30

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్ఈఎల్	21.45	4820	17
ఏలూరు – బీహెచ్ఈఎల్	21,.15	4822	32
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	19
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	26
ఏలూరు – బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	31
ఏలూరు –జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	33
ఏలూరు –జీడిమెట్ల వయా ఖమ్మం	21.00	4804	28
ఏలూరు –ఈసీఐఎల్	22.30	4814	24
ఏలూరు – బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	20.20	98511	--
ఏలూరు – బీహెచ్ఈఎల్	21.10	98503	--
ఏలూరు – తిరుపతి	16.00	4830	26

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	68–70	అరటి కాయ (1)	07–10
వంకాయలు (గులాబీ)	36	చిక్కుడు కాయలు	--
వంకాయలు (కాంతులు)	56	చామదుంపలు	48
వంకాయలు (తెలుపు)	54	ములక్కాడలు	07, 10
బెండకాయలు	48	కంద	64
పచ్చిమిర్చి	50	బీట్‌రూట్	40
కాకర కాయలు	60	కీరా దోస	50
బీరకాయలు	40	ఫ్రెంచ్‌బీన్స్	--
బీరకాయలు (పందిరి)	54	అల్లం	180
క్యాబేజీ	36	కొత్తిమీర (కట్ట)	20–40
క్యారెట్	40–56	పాలకూర	12
దొండకాయలు	34	చుక్కకూర	12
బంగాళదుంపలు	36	తోటకూర	12
ఉల్లిపాయలు	38	గోంగూర	07
గోరుచిక్కుడు	--	పుదీనా	05
దోసకాయలు	26	బఠాణి	--
ఆనబకాయ (1)	15–20	క్యాప్సికమ్	--
పొట్లకాయ(1)	20	చిలకడదుంప	58

అభయాంజనేయస్వామి సేవలో ఏలూరు ఎమ్మెల్యే



ఎమ్మెల్యే చంటికి అభయాంజనేయస్వామి చిత్రపటాన్ని అందిస్తున్న ఆలయ ఈఓ శ్రీనివాస్

హనుమాన్‌జంక్షన్ రూరల్: స్థానిక ప్రసిద్ధ అభయాంజనేయస్వామివారిని ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణ (చంటి) దంపతులు శుక్రవారం దర్శించుకున్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి కూచిపూడి శ్రీనివాస్, అర్చకులు ఆయనకు సాదరస్వాగతం పలికారు. తొలిసారి శాసనసభ సమావేశాలకు హాజరై ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత అభయాంజనేయస్వామిని కుటుంబ సమేతంగా దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఎమ్మెల్యే రాధాకృష్ణ దంపతులు హనుమంతునికి తమలపాకుల అర్చన, విశేష పూజలు చేశారు. అనంతరం ఆలయ అధికారులు ఎమ్మెల్యేకు స్వామివారి శేషవస్త్రాలు, చిత్రపటం బహుకరించి ఆశీర్వచనాలు అందజేశారు.

యోగాతో ఒత్తిడి దూరం



కార్యక్రమంలో ఏఎస్పీ స్వరూపరాణి, పోలీస్ అధికారులు

ఏలూరు టౌన్: యోగ సాధనతో మానసిక ఉల్లాసంతోపాటు, ఒత్తిడి దూరమవుతుందని అదనపు ఎస్పీ జీ.స్వరూపరాణి అన్నారు. యోగ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎస్పీ డి.మేరీ ప్రశాంతి ఆదేశాల మేరకు ఏలూరు పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో యోగ సాధన చేశారు. అశోక్‌నగర్‌లోని సై్క యోగ సెంటర్ నిర్వహకులు పి.వెంకటేశ్వరరావు, ఎన్ గౌరీ శంకర్, చిన్ని సత్యనారాయణ ఆధ్వర్యంలో యోగాసనాల ఉపయోగాలు, యోగ సాధన విధానంపై పోలీస్ సిబ్బందికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ ఎన్ఎస్ఎస్ శేఖర్, ఆర్ఐ పవన్‌కుమార్, ఆర్ ఎస్సైలు, ఏఆర్ ఎస్సైలు, సిబ్బంది ఉన్నారు.

వైభవంగా విశ్వేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక పవర్‌పేటలోని శ్రీ కాశీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి దేవస్థానంలో శుక్రవారం స్వామివారి దివ్య కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉదయం నిత్యపూజలు, అభిషేకాలు నిర్వహించి, స్వామి వారికి విశేష అలంకరణ చేశారు. రాత్రి తిరిగి నిత్య హోమాలు, బలిహరణ పూజలు నిర్వహించారు. శ్రీ గంగా, కాశీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర స్వామి వారి కల్యాణ మహోత్సవం సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు.